క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..

పొదలకూరు: పొదలకూరు నూతన తహసీల్దార్ కె.వీరవసంతరావును ఆయన కార్యాలయంలో మండల వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేత వెల్మిరెడ్డి సుబ్బారెడ్డి ఉన్నారు.

కిరణ్ సేవలు ఆదర్శం



కిరణ్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ-2

మనుబోలు : అక్కంపేట ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న సేవలు ఆదర్శణీయమని మనుబోలు ఎంఈఓ-2 సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో కిరణ్‌ను ఆయన సోమవారం కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.25 లక్షల సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించడం గొప్ప విషయమన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



మనుబోలు : మనుబోలు రైతు భరోసా కేంద్రంలో అన్నదాతలకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి షేక్ జహీర్ మాట్లాడుతూ జనుము బస్తా రూ.420, జీలగలు రూ.395, పిల్లిపెసర రూ.385లకు ఇస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి ఒక బస్తా చొప్పున ఇస్తున్నామని, రైతులు తమ పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఆర్బీకేలో సంప్రదించాలని సూచించారు. బయోమెట్రిక్ విధానంలో పంపిణీ చేస్తున్నామన్నారు. మనుబోలు మండలానికి జీలుగలు 225 క్వింటాళ్లు, పిల్లిపెసర 100 క్వింటాళ్లు, జనుము ఐదు క్వింటాళ్లు మంజూరైనట్లు తెలియజేశారు. ఆయన వెంట వీఏఏ తేజస్వి ఉన్నారు.

గిరిజన యువకుడి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: కోడూరుపాడుకు చెందిన గిరిజన యువకుడు ఈగా శ్రీను (18) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీను బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని తల్లి ఏడాది క్రితం చనిపోయింది. ఆమెను గుర్తుచేసుకుంటూ శ్రీను అప్పుడప్పుడు మనస్తాపం చెందేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తన పూరింట్లో పైకప్పు దూలానికి ఉరివేసుకుని శ్రీను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం చుట్టుపక్కల వారు గమనించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మహిళా ఎస్సై స్వప్న ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

1న క్యాంపస్ సెలక్షన్స్

నెల్లూరు(బారకాసు): కొత్తూరులోని ఎస్‌ఆర్‌ఆర్ ఐటీఐలో చెన్నైకు చెందిన ఫెనెస్టా బిల్డింగ్ సిస్టమ్స్ సంస్థ జూలై 1న క్యాంపస్ ఎంపికలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ అబ్దుల్‌రెహమాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ ట్రెయినీ పోస్టులకు ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని చెప్పారు. నెలకు వేతనం రూ.15వేల వరకు ఉంటుందన్నారు. నాన్‌టెక్నికల్ పోస్టులకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా అర్హులని తెలిపారు. నెలకు వేతనం రూ.13వేల వరకు ఉంటుందన్నారు. వివరాలకు కంపెనీ హెడ్ తోట విజయకుమార్ 91763 79690, 97039 67967 నంబర్లతో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ చార్జీల్లో పది శాతం రాయితీ

నెల్లూరు సిటీ: ప్రజారవాణా సంస్థ దూర ప్రాంత సర్వీసుల్లో రాను, పోను టిక్కెట్లను ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ప్రయాణ చార్జీల్లో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు నెల్లూరు-1 డిపో డీఎం మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి హైదరాబాద్ విశాఖపట్నం, కాకినాడ, తదితర ప్రాంతాలకు రాను, పోను టికెట్లను రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. గతంలో తిరుగు ప్రయాణానికి మాత్రమే రాయితీ ఇస్తుండగా, ప్రస్తుతం రాను, పోను వర్తిస్తుందని తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరుణాచలానికి బస్సు సర్వీసులు

ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. జూలై 2న ఉదయం 10 గంటలకు నెల్లూరు నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయాణ చార్జీ రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు) : రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరు మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం పొదుపు సంఘాల సభ్యులకు మెగా రుణ చెక్కును అందజేశారు. మండల పరిధిలో గడప గడపకు కార్యక్రమం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 సచివాలయాల పరిధిలో 81,269 గడపలు పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని విడవలూరు మండలంలోనే 16,973 గడపలకు రూ.83 కోట్ల సంక్షేమ నిధులు నాలుగేళ్ల కాలంలో లబ్ధిదారుల ఖాతాలకు అందినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ విషయాలన్నీ ప్రజలకు తెలిసే అవకాశం కలిగిందన్నారు.

ఎన్‌పీస్సార్ ట్రస్ట్ ద్వారా ఆపన్న హస్తం

విడవలూరులో పర్యటిస్తున్న సందర్భంగా ఆర్థిక ఇబ్బందులతో కష్టపడుతున్న వారికి, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న ఆపన్నహస్తం అందించారు. ముగ్గురు దివ్యాంగులకు రూ.35 వేలు విలువ చేసే బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేశారు. ఐదుగురు చిన్నారులకు రూ.20 వేల చొప్పున సొసైటీ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ బాండ్లను అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పది మందికి రూ.10 వేల చొప్పున అందజేశారు. ఇలా దాదాపు రూ.3.35 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే ప్రసన్న అందించారు. కార్యక్రమంలో కోవూరు యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, ఎంపీపీ భవాని, ఏఎంసీ మాజీ చైర్మన్ అచ్యుత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఏ రాష్ట్ర చైర్మన్ విజయకుమార్, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, సురేంద్రరెడ్డి, పార్టీ నేతలు వెంకటశేషయ్య, శ్రీహరిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బాండ్ పేపర్లు అందుకున్న చిన్నారులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

సోమిరెడ్డివి నీతిమాలిన రాజకీయాలు



మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, నాయకులు



మాట్లాడుతున్న అడపాల ఏడుకొండలు

• కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలపై చర్చకు సిద్ధమా?
• నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ అడపాల ఏడుకొండలు

వెంకటాచలం: కనుపూరు చెరువులో నిబంధనలు అతిక్రమించి మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, ఇకనైనా నీతిమాలిన రాజకీయాలు మానుకోవాలని ఇస్కపాళెం సర్పంచ్, నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ అడపాల ఏడుకొండలు హితవు పలికారు. కనుపూరు చెరువు ఆయకట్టు రైతులతో కలిసి నిజనిర్ధారణ కమిటీ సభ్యులు సోమవారం ఉదయం మట్టి తవ్వకాలు చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించారు. తవ్వకాలకు సంబంధించి అనుమతులు ఉన్నాయా.. అని నిర్వాహకులను ప్రశ్నించగా ఈనెల 15 నుంచి ఈనెల 30వ తేదీ వరకు 1,20,000 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు చేపట్టేందుకు ఉన్న అనుమతులను కమిటీకి చూపించారు. అనంతరం ఎంత లోతు తవ్వారో పరిశీలించారు. ఎక్కడా నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపట్టలేదని, తవ్వకాల వల్ల నీటి నిల్వ పెరిగి గేదెలు, వన్యప్రాణుల తాగునీటికి ఇబ్బందులు ఉండవని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ ఏడుకొండలు మాట్లాడుతూ కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలకు సంబంధించి సోమిరెడ్డి చేసే ఆరోపణల్లో ఎక్కడా వాస్తవం లేదన్నారు. ఓ పచ్చ మీడియా విలేకరి అడిగినంత డబ్బు నిర్వాహకులు ఇవ్వలేదని సోమిరెడ్డికి తప్పుడు సమాచారం ఇచ్చారని, అతని మాటలు విని ఇప్పటికే సోమిరెడ్డి ఎన్నోసార్లు నవ్వులపాలైనా ఇంకా తెలుసుకోలేకపోవడం బాధాకరమన్నారు. కనుపూరు చెరువులో ప్రస్తుతం జరిగే మట్టి తవ్వకాల వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అందరూ సంతోషం వ్యక్తం చేస్తుంటే, సోమిరెడ్డికి మాత్రం కడుపు మండిపోతోందన్నారు. మట్టి తవ్వకాలపై వాస్తవాలు తేల్చేందుకు సిద్ధమా అని సోమిరెడ్డిని ప్రశ్నించారు. ఉనికి కోసం కాకుండా, ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవు పలికారు.

'జగనన్న సురక్ష' విజయవంతానికి కృషి



కొడవలూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి



మనుబోలు : సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ

• తహసీల్దార్ రమాదేవి

కొడవలూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో వలంటీర్‌లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతిఇంటికీ వెళ్లడంతో పాటు వారి అవసరాలను ఓపికతో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను మాత్రమే కాకుండా ఇంకేమైనా సర్టిఫికెట్‌లు, సంక్షేమ పథకాలకు అర్హులున్నా విధిగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్లు వివరించారు. ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, పంచాయతీ కార్యదర్శి అంకమ్మరాణి, సచివాలయ కన్వీనర్‌లు నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రావు, ఎంఎల్‌వీఓ కిరణ్‌కుమార్, వీఆర్వో తేజ, వీఏఏ విష్ణుప్రియ, ఇంజినీరింగ్, వెటర్నరీ, డిజిటల్, వెల్ఫేర్ సహాయకులు తులసి, కరుణ, ఒసామా, రాజేష్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శేషాద్రివాసు సూచించారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్షపై అధికారులు, సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షించారు. జూలై 13 నుంచి గ్రామంలో సర్వే నిర్వహించి ఎవరికి ఏ సర్టిఫికెట్ కావాలో గుర్తించి ఆన్‌లైన్ ద్వారా అందజేస్తామని తెలిపారు. అలాగే ఏమైనా సాంకేతిక కారణాల వల్ల సంక్షమ పథకాలు అందకుంటే, వారిని గుర్తించి అర్హులైన వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు సాయికుమార్‌రెడ్డి, రజియా ఉన్నారు.

సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణానికి సహకరించాలి

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డు సుబ్బారెడ్డినగర్‌లో సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణానికి స్థానికులు సహకరించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ కోరారు. ఈ మేరకు సుబ్బారెడ్డినగర్‌లో సైడ్ డ్రెయినేజీ నిర్మాణ ప్రాంతాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.8 లక్షల నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే వీటి నిర్మాణం వల్ల కొందరికి ఇబ్బందులు కలుగుతాయని తమ దృష్టికి రావడంతో పరిశీలించామన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా సర్వే చేసి అందరికీ అనుకూలమైన ప్రాంతంలోని సైడ్ డ్రెయినేజీని నిర్మిస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆమె వెంట కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ అనంతలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సుబ్బారెడ్డినగర్ వాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపండి

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటో వార్డులో ప్రజా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, ప్రవల్లిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

పీహెచ్‌సీ సిబ్బంది సర్వే

కొడవలూరు: స్థానిక పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో సాధారణ, అతి సాధారణ వ్యాధుల(సీడీ, ఎన్‌సీడీ) గుర్తింపుపై సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి సాధారణ, అతి సాధారణ వ్యాధులున్నాయా? లేదా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారికి ఆరోగ్య గుర్తింపు కార్డులను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్డులు పొందిన వారు ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తి ఆస్పత్రులకు వెళ్తే వారికి చికిత్స అందించడం సులువుగా ఉంటుందన్నారు. వారికున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎం శేషుబాయి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

• పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు

కొడవలూరు: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి అలవాటు పడడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని కోవూరు ఎస్ఈబీ సీఐ ఆర్.నరహరిరావు అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల విలువలు కోల్పోవడంతో పాటు తల్లిదండ్రులకూ అప్రతిష్ట వస్తుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. డ్రగ్స్ కలిగి ఉన్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించడం వల్ల మంచి భవిష్యత్తును పొందుతారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ టి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు ఎస్.నర్మద, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు చిత్తు

పొదలకూరు : మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు చిత్తు అవుతుందని సీఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వాడకం- దుష్పరిణామాలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత భయంకర వ్యసనమని, దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందని చెప్పారు. ఈ సదస్సులో ఎస్సై కరీముల్లా, ప్రిన్సిపల్ అన్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బానిసలు కావద్దు

మనుబోలు : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని ఎస్సై ముత్యాలరావు సూచించారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఆయన సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాసులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ నినాదాలు చేశారు. వాటి వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు తెలియజేశారు. హెచ్‌ఎం మల్లికార్జున, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆరోరా, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం వ్యర్థం

బుచ్చిరెడ్డిపాళెం: మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితం వ్యర్థమవుతుందని సెబ్ సీఐ సూర్యనారాయణ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు 14500 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నా, తయారు చేస్తున్నా టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

వెంకటాచలం: యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే దొంగతనాలు, నేరాలకు అలవాటు పడి కుటుంబ సభ్యులకు సైతం దూరం అవ్వాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్‌రావు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ కె.సునీత, ఆర్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: అవగాహన ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు



ఇందుకూరుపేట: కొత్తూరు జెడ్పీహెచ్ఎస్‌లో..



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న సెబ్ సీఐ సూర్యనారాయణ



మనుబోలు : మాట్లాడుతున్న ఎస్సై ముత్యాలరావు



పొదలకూరు : విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ, ఎస్సైలు

ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

• తప్పిన ప్రమాదం

పొదలకూరు: స్థానిక విద్యుత్ కార్యాలయ భవనంలో సోమవారం ఒక్కసారిగా శ్లాబు పెచ్చులు ఊడిపడింది. అయితే ఆ సమయంలో అధికారులు, సిబ్బంది భోజనానికి వెళ్లడంతో ప్రమాదం తప్పింది. ఎవరికీ ఏమీ కాలేదు. దశాబ్దాల నాటి భవనం కావడం వల్లనే శ్లాబు పెచ్చులుడి పడిందని అధికారులు చెబుతున్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని ఎర్రగుంట వద్ద ప్రభుత్వం స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన జేసీని గ్రామస్తులు సోమవారం సాయంత్రం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి సుమారు 70 అంకణాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలియజేశారు. వెంటనే ఆక్రమణలు తొలగించి బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కృష్ణను జేసీ ఆదేశించారు.

కుంకాళమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరులో గ్రామదేవత కుంకాళమ్మ బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువజామున అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ అర్చకుడు పోగుల శ్రీనివాస గురుకుల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.